తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) ఉగాది మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన రచన

# పెళ్ళి

పరేష్ ఎన్. దోషి

ఏమిటి అలా చూస్తున్నారు?

ఏమిటి మీలో మీరే గుసగుస లాడుకుంటున్నారు?

'ఈమేనా ఆ లేచిపోయిన ఆడది?' అనుకుంటున్నారా?

ఆ, అలా వెళ్ళిపోతున్నారేం? మంచో - చెడో, తప్పో - ఒప్పో నే చెప్పేది వినరా?

అలా వినకుండా వెళ్ళిపోవడానికి వీల్లేదు! మొదటి నుంచీ మీరంతా యింతే. ఆడదానికి తన అభిప్రాయాన్ని వెల్లడి చేసే స్వాతంత్ర్యమే యివ్వలేదు మీరు. ఎవరైనా అలా చేసినా మీరు వినిపించుకోలేదు. తన యిష్టాను సారంగా ఆడదాన్ని బ్రతకనిచ్చారూ మీరు? పెళ్ళి చూపుల్లో 'అమ్మాయి నచ్చిందా?' అని అబ్బాయి నడిగారే గాని, 'ఈ పెళ్ళి నీకిష్టమేనా?' అని పెళ్ళికి ముందు అమ్మాయిని ఏనాడైనా అడిగారా? అలా చేస్తే, ఆడవాళ్ళకు సమస్యలే ఎందుకుంటాయండి?! ఆడ దాన్ని కూడా మనిషిగా గుర్తిస్తే యింక కావలసిందే ముంటుంది?

ఇవాళ మాత్రం మీరు చేస్తున్నదేమిటి? నేనొక కులటనని, లేచిపోయిన సిగ్గుమాలిన ఆడదాన్నని ఏవేవో తిట్టుకుంటూ వెళ్ళిపోతున్నారు! 'అసలు ఏం జరిగిందీ?' అని ఒక్కరన్నా అడిగారా నన్ను? నేను చెబుతున్నది కూడా వినిపించుకోకుండా వెళ్ళిపోవడానికి ప్రయత్నిం చారే! అసలు నన్నా పేర్లు పెట్టి తిట్టే అధికారం ఎవరిచ్చారండి మీకు?

మీరందరూ 'నిజాని'కి భయపడతారు. నిజం చెప్పే వాళ్ళని దుయ్యబడతారు! చలంగారిని మాత్రం వదిలి పెట్టారా మీరు? ఆయన అన్నది పచ్చినిజం, అందుకే కష్టంగా అనిపించింది మీకు. దైవమిచ్చిన భార్యలోనేమో అన్నారాయన, 'ఈ దేశంలో ఆడపిల్ల కావడం ఎంత నీచం! తండ్రీ, భర్తా చేసిన పాపాలన్నీ, బాధ్యతలన్నీ ఈ అమ్మాయి మీద తోసెయ్యడం ఎంత సులభం!' అని. అయినా మీకు రుచించవు. లెండి ఈ మాటలు...

నా పెళ్ళిచేసి తన చేతులు దులుపుకున్నారు మా నాన్నగారు. పెళ్ళిచూపుల్లో నేను అతనికి నచ్చానుట. పెళ్ళయిపోయింది. అతను నచ్చాడా? ఈ పెళ్ళి నీకిష్ట మేనా అని నన్నెవరూ అడగలేదు. అయినా సరే, పోనీ లెమ్మనుకున్నాను! ఇప్పుడు నాకు నా తండ్రి ఇంట్లో స్థానం లేదని నాకు తెలుసు. నేను వెళ్ళాలని కూడా అనుకోవడం లేదు. ఎప్పుడైనా పలకరింపుకోసం వెళ్ళాల్సి వస్తే అడగాల్సిన నాలుగు అడిగి, జవాబు రాబట్టే మరీ వస్తాను!

మీరందరూ ఆశించేదేమిటి? పెళ్ళి కాగానే స్త్రీకి తన భర్తమీద ప్రేమ కలగాలి. భర్త పట్ల భక్తి కలగాలి. భర్తని దేవుడిలా చూసుకోవాలి. మీలో కొందరు కవులు కూడా వున్నట్టున్నారు. చక్కగా కవితలు చెబుతారు.

**కార్యేషు దాసి... శయనేషు రంభ**

అంటూ మాకు మా విధులు చెబుతారు. పురుషుని విధులు చెబుతూ కవిత అల్లలేదేం? 'స్త్రీ సహనశీలి, త్యాగశీలి' అంటారే గాని, స్త్రీ కూడా మనిషేనని చెప్పరు! కష్టాలన్నీ ఆవిడ నెత్తిన రుద్ది, అన్ని రకాల అవమానాలకు ఆమెను గురిచేసి, చివరికి 'త్యాగ శీలివమ్మా, అనురాగశీలివమ్మా' అంటారు. ఆమెకు దేవత్వాన్నే ఆపాదిస్తారు! ఏం న్యాయమండి ఇది?!

'భర్తకు ద్రోహం చేశాన'ని అకారణంగా నాపై నింద మోపుతున్నారు! ఆయన చేసినవి మీకు తెలిసినా ఊరు కుంటారు! ఆయనమీద నాకు భక్తి కాదు కదా ప్రేమ, గౌరవం కూడా లేనంటారు? ఎలా కలుగుతుందండి నాకు ఆయన మీద ప్రేమ! రోజూ జూదమాడి, తాగి వస్తున్నారనా ఆయన మీద నాకు ప్రేమ? శృంగారం మితిమీరితే పెట్టే వాతలకు, తన్నే తన్నులకు కదండి ఆయన మీద నాకు ప్రేమ?! వంటమనిషి, పని మనిషి, కాపలా మనిషి కాకుండా కవులు చెప్పే ఆర్తి... విధులు... అదేనండి **కార్యేషు దాసి... శయనేషు రంభ** నిర్వహించినందుకు ఆయన పెట్టే కూడు, బట్టలకు కదండి ఆయనమీద ప్రేమ? ఆ అరుంధతి, శ్యామల వాళ్ళ ఇళ్ళల్లో పడుకున్న రాత్రిళ్ళు, నన్ను 'స్పేర్' చేసినందుకు కదండి ప్రేమ?!... ఎలా కలుగు తుందండి ప్రేమ?! ఆయనకు నామీద ప్రేమ లేకపోతే లేకపోయె,- కనీసం నన్ను మనిషిగానైనా చూడవచ్చు కదా! మీరంటారూ పెళ్ళయింది, కష్టమో నష్టమో కలిసే వుండాలి. పుట్టింట్లో కూడా నాకు ఆశ్రయ ముండదు! కాబట్టే మొదట్లో నేనూ అలాగే అను కున్నాను!

కన్నెగా వున్నప్పుడు కన్న కలల సౌధం బూడిదగా మారిపోగా కన్నీళ్ళు పెట్టుకునేదాన్ని. రోజులు అలా వెళ్ళబుచ్చేదాన్ని!

## చలం దివ్య స్మృతికి అంకితం

పెళ్ళి
పెళ్ళంటే ఏమిటి?
పిలుపు వేదమంత్రంలా, భుజం చుట్టూ వేసిన చేయి తాళిలా, ప్రొటెక్టివ్ లేయర్‌లా, రక్షణ వలయంలా. కలిసి గడిపేది క్షణం అయినా అది పదిలంగా మనసులో నిలిచిపోయేలా, ఒకరి నెత్తిమీద మరొకరు అనురాగపు గొడుగులు ఎత్తి పట్టు కోవాలి.

అదీ పెళ్ళంటే

## ఒక కవిత్వం

సముద్రం నుంచి
పల్చటి నీటిపొర కత్తిరించి
ఆకాశంలోకి విసిరేస్తే
ఒక మబ్బు
ఒక వాన
ఒక తొలకరి
బాధ నుంచి
బరువైన నిశ్వాసాన్ని మోసుకొచ్చి
మనుషుల్లోకి విసిరేస్తే
ఒక కవిత్వం
ఒక తిరుగుబాటు
ఒక మార్పు

— త్రిపురనేని శ్రీనివాస్

అప్పట్లో వచ్చాడు చక్రపాణి, మా పక్కవాటాలోకి. మొదట్లో నాకు అతని గురించి ఏమీ తెలీదు. నా పరిస్థితి అంతా అతను గమనిస్తూనే వున్నాడు. అతనే నాకు చేరువయ్యాడు. మొదట్లో నేను జంకాను. అతని పట్ల ప్రేమ నా హృదయంలో అంకురార్పణ జరిగిన నాడు నేను చాలా భయపడ్డాను! ఆత్మహత్య చేసుకోవాలని కూడా అనుకున్నాను. ఏదో ఘోరమైన పాపం జరిగిన భావన! మీనుంచేనండి అది నాలో వచ్చింది. ఉగ్గుపాలతోనే అలాంటివి పట్టారుగా! కాని చక్రపాణే నాకు ప్రేమంటే ఏమిటో తెలిసేలా చేశాడు. నన్ను తప్పు దోవ పట్టించాడంటారు మీరు! కాదు, నాకు మాత్రం జీవనం ప్రసాదించా డంటాను నేను! ఒకరోజు అతని కౌగిట్లో నేను కరిగిపోతూ వుండగా వారు వచ్చారు! ఆ తర్వాత ఒక యుద్ధమే జరిగిందనుకోండి! 'భారతీ! నీ బట్టలు సర్దుకో' అన్నాడు చక్రపాణి!......

ప్రస్తుతం నేనూ, చక్రపాణి కలిసే వుంటున్నాము. మాకు పెళ్ళి కాలేదు. నేను మీ 'నియమాలను' అతిక్రమించానేమో గాని, వాటిని తప్పు పట్టడం లేదు. అసలు తెలీక అడుగుతాను! పెళ్ళంటే ఏమిటండి? నాకైతే నా వారితో జరిగింది పెళ్ళి అనిపించడం లేదు. అదో పీడకలగా మరిచిపోవాలనుకుంటున్నాను కూడా. మీ దృష్టిలో చక్రపాణితో నా పెళ్ళి జరగలేదు. నాకు మాత్రం అలా అనిపించడం లేదండి! 'బట్టలు సర్దుకో భారతీ...' అంటున్నప్పుడు అవి వేదోక్త మంత్రాల్లా, నా భుజం చుట్టూ వేసిన అతని చేయి తాళిలా, మేం ఇంటి నుంచి బయటకు నడుస్తుంటే అవి సప్తపదుల్లా అనిపించింది. ఆ తర్వాత సమాజం కోసం 'పెళ్ళి' చేసుకోవాలనిపించలేదు మరి! ఇప్పుడు మేం సుఖంగా వున్నాం, అది చాలనిపిస్తోంది. మీరంటారూ, భర్తకు విడాకులిచ్చి, చక్రపాణిని చేసుకుని వుండొచ్చు కదా అని! నేను చేసింది అదేనండి! కాకపోతే మీ పద్ధతుల్లో జరగలేదు. అందుకే ఈ కళంకం నన్ను వీడట్లేదు.

నేను మిమ్మల్నిప్పుడు నిలబెట్టి మాట్లాడుతున్నది నా గురించి కాదండి! నాలాంటి ఆడపిల్లలు కోకొల్లలు. వారికి అన్యాయం జరగకుండా చూసుకొమ్మని మిమ్మల్ని వేడుకోవడం కోసం ఇదంతా!

'పెళ్ళి' విషయం మీద ఆలోచించమని మిమ్మల్ని నిలబెట్టి మరీ చెప్పడమిది!

ఇంత చెప్పినా నేను చేసింది తప్పేనంటారు మీరు! అలాగే కానివ్వండి! చెబుతున్నాను కదా నాకు నాగురించి కాదు చింత. నాకు నా చక్రపాణి వున్నాడు. చాలు. నేను ఆలోచించేది మిగతా వాళ్ళ గురించి!

మీరు వెళ్ళండి! ఏకాంత సమయంలో మీ కండిషన్డ్ మనసులను కాస్త వదులుచేసుకుని నేను చెప్పింది గుర్తు తెచ్చుకుని ఆలోచించండి.

నేను కోరేది అదే! ఆలోచించండి!

ఇక వెళ్ళిరండి!

